# విద్యా బాల మందిర్‌లో విద్యార్థులకు కంటి వైద్య శిబిరం

**కొత్తపేట,పెన్ పవర్,జూలై 21:**డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలోని కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూలులో నేత్ర వైద్యురాలు డా. కె. రజని ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 10 మందికి కంటి సంబంధిత సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ప్రతి విద్యార్థి ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని సూచిస్తూ, "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అని వైద్యురాలు పేర్కొన్నారు. ఈ విషయాన్ని పాఠశాల కరస్పాండెంట్ రామోజు అనురాధ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూకపేయి శివరత్నం,



ఆరోగ్య కార్యకర్తలు ధనవరలక్ష్మి, నాగలక్ష్మి, మీనాక్షి, దుర్గాలక్ష్మి పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ఘనంగా ఈదర చిన్నబాబు జన్మదిన వేడుకలు.



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 21;**వెంకటేశ్వర సంస్థల అధినేత, పెనికేరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈదర చిన్నబాబు జన్మదిన వేడుకలు సోమవారం ఆయన అభిమాని ఫణిచౌదరి ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామస్థులు, అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నబాబుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షులు మేకా రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి చిన్నబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు కేక్ కట్ కార్యక్రమంలో పాల్గొని వేడుకలను మరింత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా ఈదర చిన్నబాబు గుర్తింపు పొందారని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారని కొనియాడారు. సేవా కార్యక్రమాలు, సామాజిక బాధ్యతల పట్ల ఆయన చూపుతున్న నిబద్ధత అందరికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలకు అతీతంగా నిర్వహించిన ఈ జన్మదిన వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపించాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొని చిన్నబాబుకు శుభాకాంక్షలు తెలుపగా, కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో పలువురు నాయకులు, పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణలో అధికారులు కీలక పాత్ర పోషించాలి





## జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్ జూలై 21:** జిల్లాలో ఇంటింటా చెత్త సేకరణను మరింత పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు, సేకరించిన ఘన, ద్రవ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడంలో అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు.మంగళవారం స్థానిక కళాక్షేత్రం ఫాబిన్ కన్వెన్షన్ హాలులో కాకినాడ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన డీపీఓలు, డీడీఓలు, డీఎల్‌పీఓలు,ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు,పంచాయతీ కార్యదర్శుల కోసం "ఇంప్లిమెంటేషన్ ఆఫ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్--2026" అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఎం. సుధాకర్ రావు కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు --2026పై అధికారులకు అవగాహన కల్పించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ వంద శాతం పకడ్బందీగా అమలు కావాలని స్పష్టం చేశారు. గ్రీన్ అంబాసిడర్ వాహనాలు ఏ వీధికి, ఏ సమయంలో వస్తాయనే విషయంపై ముందుగానే షెడ్యూల్ రూపొందించి, వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.గ్రామ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణను కచ్చితంగా అమలు చేయాలని, నివాస ప్రాంతాలతో పాటు వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, దుకాణాల్లో కూడా ప్రతిరోజూ చెత్త సేకరణ చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించి ఇష్టానుసారంగా చెత్త పారవేసే వాణిజ్య సంస్థలపై పర్యావరణ పరిరక్షణ చట్టం--2026 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి గ్రామ పంచాయతీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెసింగ్ సెంటర్లను (ఎస్‌డబ్ల్యూఎంసీ) పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి, వెర్మీ కంపోస్ట్ తయారీతో పాటు దాని విక్రయానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మురుగు నీరు నేరుగా చెరువులు, కాలువలు, గోదావరి నదిలోకి చేరకుండా సోక్‌పిట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్లు ఏర్పాటు చేసి కాలుష్యాన్ని అరికట్టాలని అధికారులను ఆదేశించారు.పంచాయతీల ఆదాయ వనరులను పెంపొందించడంతో పాటు ప్రత్యేక అధికారుల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుని రాబోయే నెలల్లో గ్రామాల్లో పారిశుద్ధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఎం. సుధాకర్ రావు మాట్లాడుతూ ఘన వ్యర్థాలను నిరుపయోగమైన చెత్తగా కాకుండా ఆదాయాన్ని సమకూర్చే విలువైన వనరుగా చూడాలని సూచించారు. స్వచ్ఛ రథాల ద్వారా ఇంటింటా చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, ముఖ్యంగా పొడి చెత్తను వేరు చేసి అందించడం ద్వారా రీసైక్లింగ్‌కు ప్రోత్సాహం కల్పించాలని తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటును ప్రజల్లో పెంపొందించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు.వర్క్‌షాప్‌లో భాగంగా పంచాయతీ కార్యదర్శులకు ఘన వ్యర్థాల నిర్వహణ ప్రాముఖ్యతపై చిన్న నాటికలు, ప్రత్యేక ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు, కాకినాడ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల పంచాయతీ అధికారులు వి. రవికుమార్, డి.శాంతలక్ష్మి, డివిజనల్ పంచాయతీ అధికారులు పి. వాసుదేవరావు,కె.స్వప్న,అబ్రహం లింకన్,విజయభాస్కరరావు,డివిజనల్ పంచాయతీ విస్తరణ అధికారులు, వివిధ మండలాల అధికారులు, డిప్యూటీ ఎంపీడీఓలు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జగ్గంపేటలో హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వ మెటీరియల్ పంపిణీ

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 21:** జగ్గంపేట సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో కోనేటి వీధి బాలుర వసతి గృహంలో ప్రభుత్వం అందిస్తున్న మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. వార్డెన్లు పడాల రోజా, పిట్ట ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.




ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతి విద్యార్థి పేరు, చదువు, ఊరు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో అందిస్తున్న ఆహారం, వంట గదులను పరిశీలించారు. ప్రభుత్వం ఇస్తున్న ఒక పరుపు, ఒక దుప్పటి, ఒక బెడ్ షీట్, ఒక దిండు, రెండు నైట్ డ్రెస్సులు, ఒక రగ్గు, స్టీల్ ప్లేట్, గ్లాసు, గిన్నె, సబ్బులు, పేస్ట్, దువ్వెన తదితర అన్ని రకాల మెటీరియల్ ను ప్రతి విద్యార్థికి అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థను సమూలంగా మార్చుతున్నారని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. అన్ని వసతులతో పాటు తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి లబ్ధి చేకూరుస్తున్నారని తెలిపారు. బాలుర వసతి గృహంలో ఆహారం వసతులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు అందరి ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టి వైద్య పరీక్షలు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, కన్నబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, పాంద్రంగి రాంబాబు, చదరం చంటిబాబు, బొల్లం రెడ్డి రామకృష్ణ, వేములకొండ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

# ఊడుగులమ్మ అమ్మవారికి ఆషాఢ సారె.

**మోదుకూరులో ఆధ్యాత్మిక శోభ.**

**ఆలమూరు, పెన్ పవర్,జూలై 21;**ఆలమూరు మండలం మోదుకూరు గ్రామదేవత శ్రీ ఊడుగులమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా గ్రామ ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో మంగళవారం ఆషాఢ సారె సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా రకరకాల పిండివంటలు, స్వీట్లు, పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, పూలతో కూడిన సారెను మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో పాల్గొనగా, ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో నిండిపోయాయి. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం అత్యంత వైభవంగా, భక్తి పారవశ్యంతో ముగిసింది.






# పారదర్శకంగా, దోషరహితంగా ఓటరు జాబితా రూపకల్పన

- రాజకీయ పార్టీల సహకారం అవసరం
- కలెక్టర్ హరేందిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్ జూలై 21**: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా జిల్లాలో రూపొందించనున్న ఓటరు జాబితాను అత్యంత పారదర్శకంగా, దోషరహితంగా,నిష్పక్షపాతంగా సిద్ధం చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ కోరారు.మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ,కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపై వారికి వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియను ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించిందని తెలిపారు.జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ పూర్తయ్యిందని,ఇప్పటివరకు 88.05 శాతం ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు వెల్లడించారు.ప్రస్తుతం జిల్లాలో 1,640 పోలింగ్ కేంద్రాల్లో 16,50,811 మంది ఓటర్లు నమోదై



ఉన్నారని తెలిపారు. ప్రతి ఇంటికి బీఎల్‌వోలు ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేసే ప్రక్రియ విజయవంతంగా సాగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు అందించిన సహకారానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.జూలై 24 అనంతరం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపడతామని,ఓటర్ల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పునర్వ్యవస్థీకరణతో పాటు కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పోలింగ్ నిర్వహణకు అనువుగా లేని కేంద్రాలను తగిన భవనాలకు మార్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
హేతుబద్ధీకరణలో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో సుమారు 1,200 మంది ఓటర్లు ఉండేలా జిల్లాలో కొత్తగా 184 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామని,వీటిపై రాజకీయ పార్టీలు తమ సూచనలు, సలహాలు అందించాలని కోరారు.జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, అనంతరం ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను సెప్టెంబర్ 28లోగా పరిష్కరించి, అక్టోబర్ 3న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని వివరించారు.జిల్లాలో ఓటరు జాబితాను పూర్తిస్థాయి పారదర్శకతతో, ఎలాంటి తప్పులు లేకుండా రూపొందించేందుకు ఎన్నికల యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ హరేందిర ప్రసాద్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి. తిప్పేనాయక్, బీఎస్పీ ప్రతినిధి సబ్బారపు అప్పారావు, బీజేపీ ప్రతినిధి చోడిశెట్టి రమేష్, సీపీఎం ప్రతినిధి కణం ప్రసాదరావు, కాంగ్రెస్ ప్రతినిధి పోలిశెట్టి శ్రీనివాసు, టీడీపీ ప్రతినిధి గదుల సాయిబాబా, జనసేన ప్రతినిధి అడబాల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి రావూరి వెంకటేశ్వరరావు,ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం. జగన్నాధం, డీటీ తేజతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

